# ఒప్పందం

**ఆంధ్రభూమి, 24 అక్టోబర్ 99**



సాయంత్రపు ఆకాశం నెమ్మదిగా చీకటి ముసుగేసుకుంటోంది. ఆ ముసుగులో ఆశావాదికి ఉదయించబోయే మరో ఉషస్సూ, నిరాశావాదికి గడిచిపోయిన ఒక దినం గోచరిస్తున్నాయి. ఆశ నిరాశల మధ్య వూగిసలాడుతున్న సురేంద్రకి మాత్రం ఆ క్షణం చాలా ఉద్విగ్నంగా అనిపిస్తోంది.

'మీరొద్దంటే ఆ జాబ్ నాకొస్తుంది' నిస్సహాయంగా అన్నాడు. అతనిలో ఉక్రోషం... కసి... కనీ కనిపించనట్టు.

'నేనెందుకు వద్దనాలి?' మైత్రేయి ఎదురుప్రశ్న వేసింది. ఆమె అలా అడుగుతుందని అతను ముందే ఊహించాడు. అందుకే జవాబు సిద్ధం చేసుకున్నాడు. కొన్నికొన్ని కృత్రిమ విలువల్నీ, ఊహాధారమైన నమ్మకాలనీ వదిలేస్తే మనిషి ఎంతో సుఖపడచ్చు. ఆ వొదిలెయ్యడానికి కొంత సంఘర్షణ తప్పదు. ఆమెని కలపటానికి దాదాపు గంట ముందు దాకా అతనలాంటి సంఘర్షణని అనుభవించి, వొరిపిడి పడి పడి ఆఖరికి స్థిరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పుడతని మనసులో ఎలాంటి సంఘర్షణా లేదు. నిశ్చలంగానే ఉంది చాలావరకూ... ఆ విషయంలో.

'మీ కభ్యంతరం లేకపోతే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం' అన్నాడు.

మైత్రేయి షాకైంది. క్షణంసేపు చెవుల మీద మెదడుకున్న నియంత్రణ సడలిపోయింది. తర్వాత తేరుకుని విస్మయంగా అడిగింది. 'జాబ్ కోసం నన్ను పెళ్ళి చేసుకుంటారా?'

'ముప్పై నాలుగేళ్ళ నిరుద్యోగిని. నాకు ఉద్యోగం విలువేంటో బాగా తెలుసు. ఈ ఛాన్స్ మిస్సైతే నాకింక గవర్నమెంటు జాబ్స్‌కి ఏజి బారౌతుంది.'

'అందుకని..?'

'మీ హజ్బెండ్ సర్వీస్‌లో ఉండి చనిపోయారు. అందుకు మీకు గ్రాట్యుటీ, పెన్షన్, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ వచ్చాయి. కంపాషనేట్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వబోతున్నారు. నిజానికి అలా అపాయింట్ చెయ్యటానికి ఫైనాన్షియల్ స్టేటస్ చూడాలి. కానీ చూడరు. ఎందుకంటే మన సొసైటీలో హక్కుల్ని కాలరాసి దానాలివ్వటమంటే చాలా ఇష్టం'

'యూ మీన్?'

'యస్. ఐ. మీనిట్. నిజానికి మీక్కావల్సినది కొంత డబ్బు. ఇంకొంత డబ్బు, ఇంకింత డబ్బు.. అంతేనా? పాతికేళ్ళ వయసులో వున్న మీరు కోరికల్ని చంపుకుని ఆ డబ్బుతో సంతృప్తి పడి బతకాలి'

అతని మాటలకి మైత్రేయి ముఖం ఎర్రబడింది. కోపం రాలేదుగానీ వాస్తవాన్ని గుర్తించింది. వాస్తవం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది కాబట్టి ఇబ్బందనిపిస్తోంది. నిజానికి ఆమె కూడా ఎన్నో సార్లనుకుంది. ఈ డబ్బంతా తీసేసుకుని భర్తని ఎవరేనా తిరిగిచ్చేస్తే బావుణ్ణని - ఓ పూట వస్తున్నా అతని తోడుంటే అదే చాలునని.

'మీరు గనుక అడ్డు లేకపోతే ఈ జాబ్ నాకు డెఫినెట్‌గా వచ్చేది. పౌరుడిగా ఈ దేశ సార్వభౌమత్వానికి నిబద్ధుడినై ఉండాల్సిన నైతిక బాధ్యత, రేపొద్దున పెళ్ళైతే భార్యాపిల్లల్ని పోషించాల్సిన ప్రాథమిక బాధ్యత నాకున్నప్పుడు ఒక ఉపాధిని కోరుకునే హక్కు నాకు లేదంటారా?' ఆవేశంగా అడిగాడతను.

కొద్దిక్షణాల క్రితం తను సిగ్గిల్లింది మర్చిపోయి మైత్రేయి అతనికేసి దిగ్గున తలతిప్పి చూసింది. అతనిలో ఒక విశిష్టత కనిపిస్తోందామెకి. తనకేం కావాలో అతనికి తెలుసు. ఎదుటి వ్యక్తికేం కావాలో కూడా గ్రహించగలడు. బార్టర్‌ని ప్రపోజ్ చెయ్యగలడు ఆ అవసరాలు ఎలాంటివైనా.

అతనితో ఆమెకి గల పరిచయం చాలా తక్కువ. తనిప్పుడు పని చెయ్యబోయే ఆఫీసులో అదే పోస్టులో అతను డెయిలీ వేజెస్ మీద పనిచేస్తున్నాడు. తను అపాయింటవ్వగానే అతను టర్మినేటౌతాడు ఈ అత్యవసర సమావేశాన్ని అది దృష్టిలో వుంచుకునే అతను ఏర్పాటు చేశాడు. 'మీతో ఒక్క పదినిమిషాలు మాట్లాడాలి. ప్లీజ్ మేడమ్!' అనే రిక్వెస్ట్‌తో.

ఈ ఉద్యోగంలో చేరితే తన బతుకు బాగుపడుతుందని కాదు, అదో వ్యాపకమౌతుందని. ఇంట్లో కూడా అలాగే ఆలోచిస్తున్నారు. తన భర్త పోయినా పుష్కలంగా డబ్బొచ్చింది. ఆ పైన ఉద్యోగం. భుక్తికి ఏ లోటూ వుండనే ఎంతసేపూ వాళ్ళ ధ్యాస. తనకింకో కోరిక వుంటుందని వాళ్ళనుకోలేదు. వాళ్ళేంటి, సురేంద్రతో మాట్లాడేదాకా తనే అనుకోలేదు.

తనతన్ని చేసుకుంటే?

ఆమెకి వొళ్ళు జలదరించింది. అదోలాంటి భావన.

'నాకు ఆలోచించుకునేందుకు వ్యవధి కావాలి' అంటూ వెళ్ళడానికి ఉద్యుక్తురాలైంది.

***

ఇంటికొచ్చాక తండ్రితో క్లుప్తంగా చెప్పింది. 'అతనెవరో గమ్మత్తైన మనిషిలా ఉన్నాడు. ఉద్యోగం కోసం నన్ను చేసుకుంటానన్నాడు' అని క్షణం ఆగి, 'అతనికీ జాబ్ బాగా అవసరమనుకుంటా. ఏజి బార్నైపోతోందని చెప్పాడు' అంది.

గోపాలరావు కూతురి మొహంలోకి తీక్షణంగా చూశాడు.

'ఎవరి అవసరం వారిది. నీకు మాత్రం ఓ ఆధారం అవసరం లేదా?' అనేశాడు. అంతకు మించి ఆయన ఆలోచన పోలేదు.

'నేనిప్పుడు చేరలేనని చెప్పేసి ఈ వేకెన్సీ వదిలేస్తే అదతనికిస్తారు. నెక్స్ట్ వేకెన్సీకి నేను ట్రై చేస్తే సరిపోతుందేమో' అంది మైత్రేయి.

'ఓవైపు సెంట్రల్లో సరైన గవర్నమెంటు లేదు. మరో వైపు ప్రేవేటైజేషనూ, కంప్యూటరైజేషను.. ఇప్పట్లో ఇంక వేకెన్సీస్ రావు. తన్ను మాలిన ధర్మం మంచిదికాదు' అనేశాడు గోపాలరావు. ఆయనకి కూతురి మనసు చదివే శక్తి లేదు.

తననెంతో ఉత్తేజపరచి, అన్నీ అయిపోయాయనుకున్న జీవితానికి వసంత సమీరంలా అతను తెచ్చిన ప్రతిపాదనని తండ్రి ఒక్క మాటలో తేల్చి చెప్పేసేసరికి హతాశురాలైపోయింది మైత్రేయి. కూతురి ముఖంలో వచ్చిన మార్పుని పసిగట్టి నిగూఢంగా నవ్వుకుంది మైత్రేయి తల్లి.

వసంతం వస్తుంది - కోయిల కూస్తుంది.

వసంతం వెళ్తుంది - కోయిల మూగవోతుంది.

అదొక చక్రభ్రమణం. మనిషి కొన్ని కృత్రిమ విలువల్నీ రాగద్వేషాల్నీ సృష్టించుకుని త్రిశంకు

స్వంలాంటి తన సృష్టిలో తనే సాలెగూళ్లో చిక్కుకున్నట్టు ఇబ్బంది పడ్తున్నాడు. కూతురికి పెళ్ళైంది. భర్త పోయాడు. పిల్లల్లేరు. మిగిలిన జీవితమంతా మోడులా గడపాల్సిందేనా? ఎంత డబ్బు ఇస్తే ఆమె జీవితంలోని వెలితి పూడుతుంది. ఏ ఉద్యోగం, మరే వ్యాపకం ఆమె ఒంటరితనాన్ని పంచుకోగలవు?

మైత్రేయి నిశ్శబ్దంగా అక్కణ్ణుంచీ వెళ్ళిపోయింది. ఆమెకీ మరొకరి మనసు చదివే శక్తి లేదు. వాస్తవానికి ఒకరి అవసరాలు మరొకరికి అర్థమౌతాయనేది భ్రమే. మనిషి దృక్పథం పారదర్శకంగా వుండదు. చూసే వ్యక్తి తాలూకు అనుభవాల రంగులు అందులో జీర్ణించుకుపోయి ఉంటాయి.

మైత్రేయి అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాక అంది ఆమె తల్లి. 'మీరోసారి ఆ కుర్రాణ్ణి కలిసి మాట్లాడితే బావుంటుందేమో!'

'ఏం మాట్లాడాలి?' తెల్లబోయాడు గోపాలరావు.

'యోగ్యుడైతే ఉద్యోగాన్ని వదులుకుని మైత్రేయి నిచ్చిచేద్దాం' నిదానంగా అందావిడ.

'దానికి మళ్ళీ పెళ్ళా?'

'తప్పేముంది? ఎంతకాలం ఇలా ఉంటుంది? ఎంత మంది చేసుకోవటం లేదు?'

ఆయన ఆలోచనలో పడ్డాడు. మైత్రేయి ఆ విషయం తనకి ప్రత్యేకించి చెప్పటంలో ఆమె మనసు అవగతమైంది. రెండో పెళ్ళి చేసుకునే మగవాడైనా కేవలం శారీరక సుఖం కోసం చేసుకోడు. తను చివరిదాకా ప్రశాంతంగా బతకడం కోసమో, పిల్లల కోసమో, ఏదేనా బలహీన క్షణంలో తప్పటడుగులు వేసి బురదలో కూరుకుపోకుండా ఉండటం కోసమో... ఇలా ఎన్నో కారణాలుంటాయి. మైత్రేయికి కూడా అలాంటి కారణాలు కొన్ని ఉండవచ్చు.

★★★

'మైత్రేయిని పెళ్ళి చేసుకోవటానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు' స్థిరంగా అన్నాడు సురేంద్ర.

అతని మాటల తర్వాత అక్కడ కొద్దిసేపు నిశ్శబ్దం చోటు చేసుకుంది. చివరికి దాన్ని ఛేదిస్తూ అన్నాడు గోపాలరావు. 'మైత్రేయి వదులుకుంటే నీకొచ్చే ఉద్యోగాన్నో తన వెనకున్న డబ్బో చూసి ప్రలోభపడుతున్నావేమో! అలాంటి ప్రలోభంతో చేసుకున్న పెళ్ళిలో వుండే సుఖం ఎండమావి లాంటిది'

సురేంద్ర చిన్నగా నవ్వాడు. 'లక్షో రెండు లక్షలో కట్నమిచ్చి ఆమెకి చేసిన మొదటి పెళ్ళిలో మాత్రం ప్రలోభం లేదంటారా? అసలు ప్రలోభం, మ్యూచువల్ డిపెండెన్స్ లేకుండా ఏవి సాధ్యమౌతాయంటారు?' సూటిగా ప్రశ్నించాడు.

గోపాలరావు డంగయ్యాడు. నిజమే. కట్నం చూసేగా వాళ్ళు తన కూతుర్ని చేసుకున్నది? అదీ చాలదని అలకపాన్పు మీద స్కూటరు, మొదటి పండక్కి కలర్ టీవీ అడిగారు. అవన్నీ ఇస్తున్నప్పుడు తనకది ప్రలోభమని పించలేదు. పైగా ఆ సంబంధం కుదిరితేనే చాలనిపించింది. కేవలం ఉద్యోగం కోసం ఈ కుర్రాడు ముందు కొస్తుంటే ఎందుకిన్ని సందేహాలు? తను వెయ్యబోతున్నది తప్పటడుగనే సందేహం చేతనా? పెళ్ళనేది మొదటిసారేనా రెండోసారేనా లాటరీయే! అలాంటప్పుడు మరో టికెట్ కొంటే తప్పేంటి? తన ఆలోచనలు ట్రాక్ తప్పుతున్నట్టు గ్రహించి కంట్రోల్ చేసుకున్నాడాయన.

'మీ ఇద్దరికీ ఇష్టమైతే మాకెలాంటి అభ్యంతరం లేదు' అనేశాడు.

★★★

'అదేంట్రా? వితంతు వివాహం మనింటా వంటా లేదు. అనాచారం కూడాను. ఐనా రేపో మాపో ఉద్యోగం వస్తుంది. లక్షణంగా కట్న కానుకల్తో లక్ష్మీదేవి లాంటి కోడలొస్తుందనుకున్నాను' మెళ్ళో పూలదండల్తో ఆటో దిగిన సురేంద్ర, మైత్రేయిలని చూసి, అంతా జరిగిపోయాక బయటగొడవెందుకని లోపలికిరానిచ్చి, విషయం క్లుప్తంగా తెలుసుకుని అంది సురేంద్ర తల్లి.అతని పెళ్ళి మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఇంకెన్నో కలలు కంటున్న ఆవిడకి అశనిపాతంలా తగిలింది. మనసులో మాటలన్నీ మరో ఆలోచన లేకుండా అనేసింది.

మైత్రేయి మనసు చివుక్కుమంది. ఇంట్లో ముందుగా చెప్తే ఒప్పుకోరనీ, పెద్ద గొడవౌతుందనీ గుడిలో పెళ్ళి చేసుకుని తీసుకొచ్చాడు. దాన్నిబట్టే అర్థమైంది. తనకిక్కడెలాంటి రిసెప్షనుంటుందో. ఐనా బాధనిపించింది.

సురేంద్ర అపాలజెటిగ్గా చూశాడామెకేసి. పర్వాలేదన్నట్టు తలూపిందామె. తర్వాత తల్లితో అన్నాడతను. 'ఒక స్త్రీ, ఒక పురుషుడు ఆజీవనం అన్ని విషయాల్లో కలిసి వుంటామని చేసుకున్న ఒప్పందమే పెళ్ళికి ప్రాథమిక దశ. తర్వాత సంస్కృతి పెరిగింది. నాగరికత పెరిగింది. పెళ్ళికి అనేక హంగులొచ్చాయి. ఫలానా అమ్మాయిని లేక అబ్బాయిని అని సెలక్ట్ చేసుకోవడం రెండో దశ. ఆ పైన వ్యక్తిగత సామాజిక అవసరాలు ఆ సెలక్షన్ని శాసించడం ప్రస్తుతం మనం వున్న దశ. నాకు ఉద్యోగం లేదు. మైత్రేయి తన జాబ్ అవకాశాన్ని నా కోసం వదులుకుంది. జాబ్ ద్వారా వచ్చే సెక్యూరిటీని నేనిస్తానన్నాను.'

సురేంద్ర తల్లి మరీ తెలివితక్కువదేం కాదు, కొడుకు చేత ఇంకా విడమర్చి చెప్పించుకోడానికి. భార్యాభర్తల మధ్య వున్న ఒప్పందం లాంటిదే తల్లీ దండ్రీ పిల్లల మధ్య కూడా వుంది. ఈ తరుణంలో కొడుకుని దూరం చేసుకుంటే నష్టపోయేది తామేనని అర్థం చేసుకుని మైత్రేయికేసి చూసింది.

తలొంచుకుని నిలబడి ఉందామె. తన కొడుకుని చేసుకున్నాక ఇంకా వైధవ్యమేమిటి? పిల్ల లక్షణంగా ఉంది అని మనసు సరిచేసుకుని 'అమ్మాయిని లోపలికి తీసికెళ్ళు' అంది కొడుకుతో.